క్లుప్తంగా

సంక్షేమ పథకాల అమలుపై ఇంటింటి ప్రచారం



వెంకటాపురంలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎంఎల్‌ఓ మధుసుధాకర్

బనగానపల్లె : మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంఎల్‌ఓ మధుసుధాకర్, వలంటీర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులాలు మతాలు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న కౌన్సిలర్ ఇంతియాజ్‌బేగం

డోన్ రూరల్ : జగనన్న కాలనీలో ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం పట్టణంలోని 11వ సచివాలయంలో కౌన్సిలర్ ఇంతియాజ్‌బేగం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ బుజ్జమ్మ, 21 వార్డు ఇన్‌చార్జి ఆదాం అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు



అవార్డును అందుకుంటున్న బాల తిమ్మరెడ్డి

సంజామల: మండల కేంద్రం సంజామలలోని గ్రంథాలయ సంస్థకు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు లభించింది. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ బుధవారం 2023–2024 అవార్డులను ప్రదానం చేసింది. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శితో కలసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సంజామల గ్రంథాలయ సంస్థ అధికారి బాల తిమ్మరెడ్డికి అవార్డును ప్రదానం చేశారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన బనగానపల్లె బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక బార్ అసోయేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా కె.ఖాజాహుస్సేన్‌సాహెబ్, ఉపాధ్యక్షుడిగా మల్లె తులసిశ్వరమ్మ, జనరల్ సెక్రటరీగా టీ జెమ్స్, జాయింట్ సెక్రటరీగా ఎస్ఎండీ అల్లావుద్దీన్, ట్రెజరర్‌గా మండ్ల రఘురామిరెడ్డి, లైబ్రరీయన్‌గా ఎం దస్తగిరి ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు పరశురామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ ఖైర్, టీఆర్ జగన్నాథ్‌రెడ్డి, పీఎండీ అజాంహుస్సేన్, బాబావలి సహకారంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ కూలర్‌ను ప్రారంభించిన ఏడీఏ



డోన్ రూరల్ : పట్టణంలోని పాతబస్టాండ్ ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను బుధవారం ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామల నుంచే వచ్చే ప్రజలు, రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ అబ్దుల్‌షఫి, ఫిర్టలైజర్స్ యజమానులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో బుధవారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన గాజుల కమాల్‌వలి సచివాలయం సమీపంలో గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. విద్యుత్ తీగలు ఉండటంతో నిప్పు రవ్వలుపడి గడ్డివామితో పాటు సమీపంలోని దిబ్బలకు క్షణాల్లో మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. రూ.30 వేలకు పైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి

- పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం
- రూ.8కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



పెట్నికోటలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



తుమ్మలపెంటలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: గతంలో ఎప్పుడూ జరగనంతగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రజలందరికీ మంచి చేసిన ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరో సారి ఆశీర్వదించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ.8 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను బుధవారం ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ముందుగా తుమ్మలపెంట జగనన్న కాలనీలో 51 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. చెంచుగూడెంకు వెళ్లి ప్రజలకు రేషన్ కార్డులతోపాటు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. అదేవిధంగా బందార్లపల్లె, తిమ్మనాయినపేట, బితాడిపత్రి, బిఉప్పలూరు, నాగిశెట్టిపల్లె, పెట్నికోట, కొండమీదపల్లె గ్రామాల్లో రూ.8కోట్లకు పైగానే వెచ్చించి నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, పాలకేంద్రం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, సీసీ రోడ్లు, పాలీష్ ఫ్యాక్టరీలకు 24 గంటల విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులను జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితో కలిసి వారు ప్రారంభోత్సం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రెండేళ్ల పాటు కరోనా వచ్చినా ఎక్కడా పథకాలు ఆగలేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచేలా చేశారని కొనియాడారు. గ్రామాల్లో ఎక్కడా చూసినా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఓట్ల కోసం ఆలోచించకుండా మారు మూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో నడిపించామని చెప్పారు. పెట్నికోటలో 180కి పైగానే పాలీష్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, గతంలో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా మూలంగా యజమానులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. 24 గంటల విద్యుత్ కల్పించడం అందరికీ ఉపయోగంగా ఉంటుందని, మరిన్ని చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

టీడీపీ పునాదులు కదులుతున్నాయి

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధితో పాటు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి టీడీపీ పునాదులు కదులుతున్నాయని ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాల మధ్య తేడాను ఒక్క సారి ప్రజలు ఆలోచించాలన్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు నిలువునా మోసం చేశాడన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రాజకీయ నాయకుడంటే ఇలా ఉండాలనేలా మార్పు తీసుకొచ్చారన్నారు. పేదలకు భూములు ఇస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏ ముఖం పెట్టుకొని టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో గ్రామాల్లో తిరుగుతున్నారని ప్రశ్నించారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే మరింత మెరుగైన పాలనతో మళ్లీ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ సాయికృష్ణ, ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి, ఏడీ ఖాజావలి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు బెస్త మల్లేశ్వరి, యాతం స్వర్ణలత, ఈశ్వరయ్య, మదార్‌బీ, ఎంపీటీసీ సభ్యులు కుమారి, రామలింగమ్మ, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈఓ మద్దిలేటి, ఆలయ మాజీ చైర్మన్ యమసాని జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్త జన సందోహం మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రూప్ దేవాలయాల మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్ రావు, భక్తులు భజన కృష్ణయ్య, లక్ష్మినారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంతమార్కెట్, బండ్ల మెట్ట వేలం పాటలు వాయిదా

బేతంచెర్ల: నగర పంచాయతీకి సంబంధించి సంత మార్కెట్, బండ్లమెట్ట, కమేళా వేలం పాటలు బుధవారం నిర్వహించారు. సంతమార్కెట్, బండ్లమెట్టకు సరైన వేలం పాట రాని కారణంగా గురువారానికి వాయిదా వేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. కమేళాకు సంబంధించి మనోహర్ అనే వ్యక్తి రూ. 2,05,000 హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

బేతంచెర్ల: ఓటు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ అన్నారు. బుధవారం పట్టణ ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భారతి, సులోచన, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కాటసాని ఓబులరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపాల్ నగర్, కూరగాయల మార్కెట్ కాలనీ వాసులు

బనగానపల్లె : బనగానపల్లె నియోజకవర్గంలో రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపరలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని గోపాల్‌నగర్, కూరగాయాల మర్కెట్ కాలనీలకు చెందిన 25 కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, తనయుడు కాటసాని ఓబులరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వలి, కె సుధాకర్, మాబాషా, మరియమ్మ, ఆషా, కుమారి, జహరాబీ, అమీనా, రాణి, సునిత తదితరులకు కాటసాని జయమ్మ, కాటసాని ఓబులరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాకప్పి ఆహ్వానించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో జరుగుతుతన్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అత్తార్‌జాహెద్‌హుస్సేన్, పి సుదర్శన్‌రెడ్డి, కోనేటి దుర్గా, గట్టు రమేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

బేతంచెర్ల: విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయనాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు మధు సూధన్, రాజేష్ అన్నారు. బుధవారం బనగానపల్లె రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడులు, జామెంట్రీ బాక్సలను ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ అబీదా బేగం, అసోసియేషన్ సభ్యులు నాయుడు, నాగేంద్ర, శ్రీలక్ష్మి, గోవిందరెడ్డి, బాల వెంకరమణ, హుస్సేన్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామంలో జీర్ణోద్ధరణ చేసిన సిద్దరామేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం బుధవారం వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, సతీషశర్మ ఆధ్వర్యంలో పూజల అనంతరం శాస్త్రోక్తంగా సిద్ధివినాయక, పర్వత వర్ధిని, గంగాదేవి, నవగ్రహ, నందీశ్వర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చెర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్



చెత్త,చెదారాన్ని తొలగించాలని స్థానికులకు సూచిస్తున్న కమిషనర్ జయరాం

డోన్ రూరల్ : పట్టణంలోని కొండపేట 6వ సచివాలయ పరిధిలోని కాలనీల్లో బుధవారం మున్సిపల్ కమీషనర్ జయరాం పర్యటించారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మురుగు కాల్వల తీరును పరిశీలించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే మాదృష్టికి తీసుకొని రావాలన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఫాతిమాబీ, వార్డు ఇన్‌చార్జి గౌస్, మున్సిపల్ ఏఈ సురేష్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు

- నేటి నుంచి యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు





యాగంటిలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులు, ముస్తాబైన పాతబుగ్గ రామలింగేశ్వరుడు

బనగానపల్లె : మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను సుందరంగా అలంకరించారు. పవిత్ర శైవక్షేత్రంగా పెరుగాంచిన యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 7వ తేదీ రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి, ధ్వజారోహనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8న మహాన్యాసపూర్వకరుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి తదితర పూజలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవకాల ప్రత్యేక పూజలు, 9న ఉదయం తెల్లవారుజాము స్వామివార్ల కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు నందికోల ఉత్సవం జరుగుతాయి. 10న సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల రథోత్సవం, 11న ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజల అనంతరం శివదీక్ష విరమణ పూర్ణహుతి నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సతం, సాయంత్రం ధ్వజారోహనం కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

డోన్ : మహా శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణ శివారులో ఉన్న కొత్త, పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో నాలుగురోజుల పాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. 8వ తేదీన జాగరణ, 9న శివపార్వతుల కల్యాణం, 10వ తేదీన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు కోట్రికె హరికిషన్, బైసాని రాజులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నాల్గవ రోజు కూడా దేవాలయ మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేసిన దుకాణాలలో వివిధ వస్తువులను కొనుగోలు చేసేందుకు జనం భారీగా వస్తారని అంచనా వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. చిన్నపిల్లల కోసం రంగులరాట్నం, వాటర్ స్కేటింగ్, వివిధ రకాల ఆట వస్తువులు, జాయింట్ వీల్‌లు కూడా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో జార్కండ్ వాసి మృతి

బేతంచెర్ల: పట్టణంలో ఓ పాలిస్ ఫ్యాక్టరీలో పని చేస్తూ గుండెపోటుతో మరణించిన జార్కండ్ వాసి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు ఆనల్గురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు. జార్కండ్ కు చెందిన పరవ్ సారెన్‌కు (26) అకస్మాత్తుగా ఛాతిలో నొప్పిరావడంతో స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. అతనికి ఎవ్వరూ లేకపోవడంతో స్థానికుల సూచన మేరకు ఆ నల్గురు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వన్నూర్ బాషా, సభ్యులు పరవ్ సారన్ మృత దేహాని అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య, భర్తలపై దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని పాపసాని కొట్టాల గ్రామంలో పొలం రస్తా విషయంలో భార్య, భర్తలపై దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖరప్ప వివరాల మేరకు కొట్టాల గ్రామానికి రామ తిమ్మారెడ్డి, లక్ష్మి దేవి దంపతులపై పొలం రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన పాపసాని గోవిందరెడ్డి, వెంకట తిమ్మారెడ్డి గొడవ పెట్టుకొని దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న ఎమ్మెల్యే



రూ.23.94లక్షలతో మంగంపేటలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



రూ.24.8 లక్షలతో మంగంపేటలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

అవుకు: మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసాకేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో తీరాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో గ్రామం కళకళలాడుతోంది. ఈ మేరకు రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.24.8 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్, రూ.38.4లక్షలతో గ్రామ సచివాలయంతో పాటు పలు సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

బుడగ జంగాల కమ్యూనిటీ హాల్ ముస్తాబు

- నేడు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన



దొరపల్లె గ్రామంలో రూ. 35 లక్షలతో నిర్మించిన బుడగ జంగాల కమ్యూనిటీ హాల్

డోన్ : మండలంలోని దొరపల్లె గ్రామంలో బుడగ జంగాల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ముస్తాబైంది. 2019 ఎన్నికల ముందు బుడగ జంగాలు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రస్తుత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి విన్నవించారు. పట్టణ శివారులోని జంగాల కాలనీతో పాటు దొరపల్లె గ్రామంలో సుమారు 1500 బుడగ జంగాల కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీరు వివాహాది శుభ కార్యాలు జరుపుకునేందుకు వేదిక లేదు. దేవాలయాలు, కల్యాణ మండపాల్లో నిర్వహించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని బుడగ జంగాల సమస్యను పరిష్కరిస్తామని బుగ్గన అప్పట్లో హామీ ఇచ్చారు. బుడగ జంగాలకు ఇచ్చిన హామీ మేరకు బుగ్గన ప్రత్యేక చొరవ తీసుకుని రూ.35లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు అన్ని వసతులతో సుందరంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను గురువారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఏళ్లతరబడి ఇబ్బందులను తొలగించి కమ్యూనిటీ హాల్‌ను నిర్మించిన మంత్రి బుగ్గనకు బుడగజంగాల సంఘం అధ్యక్షుడు మహేష్‌తోపాటు స్థానికులుకృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటాం



రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఈద్గా ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని



రూ.83.19లక్షలతో నిర్మించిన గిడ్డంగిని ప్రారంభించిన కాటసాని రామిరెడ్డి

అవుకు: ముస్లిం సోదరులకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కొన్నివారాల క్రితం అవుకు పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యేకు అవుకు ముస్లింలు వివిధ సమస్యలను విన్నవించిన విషయం తెలిసిందే. వారికి ఇచ్చిన హామీ మేరకు అవుకు పట్టణ సమీపంలోని నమాజ్ కొండమీద ఉన్న ఈద్గా అన్యక్రాంతానికి గురికాకుండా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. తన సొంత నిధులతో కాటసాని నాగార్జున్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5లక్షలు వెచ్చించి ఈద్గా చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, గేటును బుధవారం అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కొత్తకాలువ సమీపంలో ఉన్న కబరస్థాన్ (ముస్లిం శ్మశాన వాటిక) చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించటానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రూ.22లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు ప్రహరీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ముస్లిం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నామన్నారు. బనగానపల్లెలో రూ.69లక్షలతో హజరత్ మాసుం బాషా ఖబరస్థాన్ ప్రహరీ నిర్మించామని, షియా మతస్తులకు కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సొంత నిధులు రూ.30లక్షలతో ఇబాధత్‌ఖానా నిర్మించామని గుర్తు చేశారు. గతంలో రూ.25లక్షలతో ఈద్గా ప్రహరీ, అవుకు మెట్ట వద్ద ఉన్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి మొదటి విడతగా రూ.20లక్షలు నిధుల మంజూరు, రూ.1.20 కోట్లతో కమ్యునిటీ హాల్ (షాధీఖానా), అలాగే కోవెలకుంట్లలో రూ.1.2కోట్లతో కమ్యునిటీ హాల్ (షాధీఖానా), రూ.23లక్షలతో కమ్యునిటీ హాల్లో అన్ని వసతుల ఏర్పాటు చేశామని తెలిపారు. అందరూ కలిసికట్టుగా ఉండాలని, అప్పుడే మరింత అభివృద్ధి చెందుతారని, తనవంతు సహక సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కాటసాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు యూనిస్ పాషా, కార్యదర్శి హుస్సేన్ వలి, మజీద్ కమిటీ సభ్యులు ముల్లా షఫి, మత్తేసా, డాక్టర్ జిలానీ, కరిముల్లా, బాషా, ఇస్మాయిల్, నాయకులు వాయునందగౌడ్, వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్టర్ మద్దయ్య, రామక్రిష్ణ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని, అన్నదాత అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని రవ్వల కొండపై రూ.83.19లక్షలతో నిర్మించిన రైతు బహుళప్రయోజన సౌకర్య గిడ్డంగిని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుముక్కల పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో రైతుల సౌకర్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సహకార సంఘాలు అభివృద్ధి పదంలో నడుస్తున్నట్లు తెలిపారు. ఈ సహకారం సంఘంలో రైతులకు సకాలంలో ఎరువులు, రుణ సౌకర్యం కల్పించడమే కాకుండా లాకర్ సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చి ఎన్నికల్లో ప్రజలందరూ అండగా ఉండి మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని రైతులను కోరారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, భానుముక్కల సహకర సంఘం చైర్మన్ నీలిశ్రీనివాసులు, సొసైటీ సీఈఓ మునాప్, వైఎస్సార్‌సీపీ నాయకులు కిశోర్, రామచంద్రారెడ్డి, పి వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, గాధంశెట్టి వేనుగోపాల్, డాక్టర్ రవికుమార్, కృష్ణ, తదితర వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సుబ్బారావు

అవుకు: స్థానిక బస్టాండ్ సమీపంలో ఈనెల 4వ తేదీ సాయంత్రం భార్యను భర్త అతికిరాతంగా నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు హత్య చేసిన నిందితుడు అవుకు పట్టణంలోని కోట వీధికి చెందిన పోలక రంగస్వామిని గ్రామ సమీపంలోని జంబులమ్మ ఆలయ సమీపంలో బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి అరెస్టును చూపిన సీఐ సుబ్బారావు, అవుకు ఎస్ఐ కిరణ్ బాబు మాట్లాడుతూ అవుకు పట్టణానికి చెందిన పోలక రంగస్వామి తన భార్య అయిన పోలక కుమారి వేరే వారితో సన్నిహితంగా ఉన్నదనే అనుమానంతో హత్య చేశాడన్నారు. తాగుడుకు బానిసై, కుటుంబాన్ని పోషించకుండా కుమారిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. పెద్దమనుషుల వద్ద పంచాయతీ పెట్టించి, అవమానిస్తోందని కక్ష పెంచుకొని కుమారిపై బస్టాండ్ సమీపంలో ఉన్న గంగరాజు టెంకాయల షాప్ వద్ద చెక్కపిడి కత్తితో విచక్షణారహితంగా నరికి చంపాడు. అడ్డువచ్చిన మృతురాలి పిన్ని బందారు సుబ్బలక్ష్మమ్మను చంపాలనే ఉద్దేశంతో కత్తితో దాడి చేసి రక్త గాయాలు చేశాడన్నారు. ఈమె కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై ఐపీసి సెక్షన్ 498(ఏ), 302, 307 కింద కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.